

# డ్యూటీ

గంటిమెళ్ల గోపాలకృష్ణ



రాత్రి పన్నెండు.

డ్యూటీ చార్జి తీసుకున్నాడు రామారావు.


‘‘పురుషోత్తం. నువ్వు 18333 ఇంజను ఫైనల్ టెస్టింగ్ చేసి రెడీ చెయ్యి. గత షిఫ్టు వాళ్ళు దీన్ని రిపేరు చేశారు. రాంబాబూ నువ్వు 18295 ఇంజను టెస్టుచేసి రెడీచెయ్యి.

కనకారావ్ నువ్వు పురుషోత్తానికి హెల్పింగ్‌గా వెళ్ళు. రాంబాబూ బాలని నువ్వు తీసికెళ్ళు. రాఘవరావు నువ్వు మైనర్ రిపేరు సెక్షనులో ఆయిల్సు చూసుకో. సత్యారావుని హెల్పింగ్‌కి తీసికెళ్ళు.

గురువులూ నువ్వు కార్డియమ్. రామాన్ని తీసుకో. సుబ్బారావు 18295 బ్రేకు రిపేర్లు చెయ్యి. సేమ్యూల్‌ని తీసుకో ......"

ప్రీవియస్ షిఫ్టు హేండోవర్ చేసిన "జాబ్"కి మనుషుల్ని సర్దేసి "ఎమర్జెన్సీ" కోసం "రామన్"ని అట్టేపెట్టి, రాబోయే ఇంజన్ల మీద పనిచేసేందుకు నలుగురిని "బుక్" చేస్తానని చెప్పి "కేంటీన్"లో వెయిట్ చెయ్యమని చెప్పి పంపేశాడు.

వాల్తేరు డీసెల్ లోకోషెడ్డు ఎప్పుడూ రణగొణమంటునే వుంటుంది వచ్చేపోయే ఇంజన్లతో. వాటిని పట్టుకుపోయేందుకు



డ్రయివర్లు. తెచ్చిన స్టేఫూ. రిపేరు చేసే మెకానిక్కులు. క్లీన్ చేసే క్లీనర్లు. క్రేనులూ, జీపులూ. ఎవరి పనుల గాభరాలో వాళ్ళు.... అటు హౌరా— రాయ్‌పూర్ల వక్క. ఇటు బెజవాడవక్క వెళ్ళేందుకు గూడ్సు బళ్ళకు. మెయిల్, ఎక్సుప్రెస్సు బళ్ళకోసం ఇంజన్లు వాల్తేరు షెడ్ సరయిన సమయంలో సప్లయి చెయ్యడానికి నిరంతరం పరిశ్రమిస్తూనే వుంటుంది.

రైల్వేలో జాయినయిన దగ్గర్నించి షిఫ్టు డ్యూటీ అలవాటయినా "అవులింత"లు మాత్రం తగ్గలేదు సూపర్‌వైజర్ రామారావ్‌కి.

మరో పది నిముషాల్లో శంకర్రావు రింగ్ చేస్తాడు "గురూగారూ. ఇన్ కమింగ్ నోట్ చేసుకోండి" అని. నిజానికి రామారావు శంకర్రావు కన్నా అయిదేళ్ళు చిన్న. ఎప్పుడూ కలుసుకోలేదు. ఫోన్లో మాత్రం గత అయిదు సంవత్సరాలుగా పరిచయస్థులు. రైల్వేలో ఇలాటి పరిచయాలు కోకొల్లలు.

ఫోను రింగయింది. రిసీవరు ఎత్తేరు రామారావు. శంకర్రావు గొంతు.

"గురూగారూ. కొంప మునిగింది. కోరమండల్ ఎక్సుప్రెస్సుకి వెళ్ళాల్సిన ఇంజను యార్డులో ఫెయిలయింది. మరో ఇంజను వుంటే ఇచ్చేయండి. షంటరును పంపిస్తాను."

"ఇంకా ఎనిమిది గంటలు టైముంది కదండీ. గాబరా పడతారేం. ఏదో ఓ ఇంజనిస్తాన్లెండి" అని ఫోను పెట్టేసాడు రామారావు. పవర్ కంట్రోలర్ శంకర్రావు అంటే రామారావుకి సానుభూతి. ఇంజన్లు ఏవేవి ఎక్కడెక్కడ పనిచేస్తున్నాయో ఏవైనా ట్రబులిస్తున్నాయో కాకుండానే షెడ్‌లోవున్న ఇంజన్లు రిపేరయి సరయిన సమయానికి షెడ్ వదిలేందుకు వీలుకాని పరిస్థితుల్లో ఏదో అయిడియా ఇచ్చి ఎవరినీ బాధపెట్టకుండానూ, రైల్వేకి నష్టం లేకుండానూ వెయ్యి కళ్ళతో చూస్తుంటాడు కాబట్టి.

షెడ్‌లో వున్న ఇంజన్ల చరిత్ర తిరగేసాడు రామారావు. "కోరమండల్"కి పట్టయిన ఇంజను ఒక్కటీ లేదు. ఈసారి కంగారుపడ్డం రామారావు వంతయింది. 'ఇన్ కమింగ్'లో ఏమున్నాయో తరిచి చూసేడు.

శంకర్రావుకి రింగ్ ఛేశాడు. మొదటిదే మంచి ఇంజను! అదృష్టమంటే అలా వుండాలి. రామారావు అనుకోవడమేమిటి 18336 షెడ్ "టచ్" అయిందని "కప్లింగ్ బోయ్" చెప్పడమేమిటి ఒక్కసారే జరిగిపోయేయి.

ఫోను రింగయింది. రామారావు రిసీవరు ఎత్తేరు. ఇంజిన్ షెడ్డుకి వచ్చే దారిలో లైను షెడ్డువైపుగా చీలిన దగ్గర మరో ఇంజన్ పట్టాలు తప్పింది!

"సరిరా!" మరి రావాల్సినవేవీ నాలుగైదు గంటల వరకూ షెడ్ పక్క రాలేవు.

శంకర్రావుకి రింగ్‌చేసి 18336 నామినేట్ చెయ్యొచ్చునని చెప్పేరు. "థేంక్యూ" అని ఫోను పెట్టేశాడు శంకర్రావు. సమస్య శంకర్రావుకి అంతటితో పరిష్కారమయ్యింది. కానీ రామారావుకి తగులుకుంది.

18336లో డీజిలాయిలు పోసుకొని రావాలి. ఇంజిన్ కడిగించాలి. మూతి తిప్పాలి రిపేరు బుక్కులో డ్రయివర్లు బుక్ చేసిన రిపేర్లు చేయించాలి. అప్పుడు షంటరు వాక్యూమ్ వగైరా టెస్టు చేసుకొని రైట్టయిమ్‌లో షెడ్ వదలాలి.

18336ని ఇంజిన్లకు మైనర్ రిపేర్లు చేసే "బే"లో కెక్కించారు.

రాత్రి 1—30.

అయిదుగురు ఫిట్టర్లనీ అయిదు పనులకూ పురమాయించేడు రామారావు. బండి పరిగెట్టడానికి పనికొచ్చే చక్రాలు తిరగడానికి పళ్ళ చక్రాలు తగిలించి వుంటాయి. వాటికి గేరుకేసులుంటాయి. వాటిలో గేర్లు ఒరిపిడి లేకుండా పనిచెయ్యడానికి 'కార్డియమ్' అనే నల్లని ముద్ద గురువులు అనే ఫిట్టరు వేస్తుంటాడు. "గురువులూ! నీ చేతులు ఎప్పుడూ తెల్లగానే వుంటాయి" అని రామారావు సరదాగా జోక్ లేస్తాడెప్పుడూనూ. "అదేంటి సార్ నా ఇంజిన్లెప్పుడయినా ఫెయిలయ్యాయా" అంటాడు గురువులు. నిజమే! గురువులుకి గత పదిహేను సంవత్సరాలుగా అదే పని. చాలా రకాలుగా చాలా ఇంజన్లు ఫెయిలయ్యాయిగానీ కార్డియమ్ లేకపోవడంవల్ల గేర్లు పాడయినట్లు రికార్డులో లేదు. అదే గురువులు ప్రత్యేకత!

ఇంజిను త్వరత్వరగా టెస్టింగ్ అవుతోంది.

"అవసరం వున్నా లేకపోయినా బోల్డన్ని రిపేర్లు బుక్ చేసేస్తారు డ్రయివర్ నాకొడుకులు. ట్రాటిల్ ఇప్పి పరిగెత్తమంటే పరిగెడతారుగానీ ఒక్క లీకు అరెస్టు చెయ్యమనండి చూద్దాం. వాళ్ళకి పదిహేను వందలు జీతం. నేను కష్టపడి రిపేరు చేసినందుకు

అయిదు వందలే నా జీతం...." వేదాంతం మాట్లాడతాడు లీడింగ్ మెకానిక్ రాజు.

చేతుల నిండాను. గుడ్డలమీదను నల్లటి మరకల్తో రాజు వొచ్చేదాకా ఇంజిన్ కదుల్తుందా లేదా అని రామారావు ప్రాణాలు టువ్వు టువ్వు మంటునే వుంటాయి.

"సార్ కంప్రెషర్ బౌ పైపు నట్టు వదిలేసింది. మెయిన్ రిజర్వాయర్ ఎయిర్ లోడింగ్ అన్‌లోడింగ్ అవశం లేదు. ల్యూబాయిల్ ఫిల్టరు రింగు లీకవుతోంది. మార్చాలి. వాక్యూమ్ ఔస్టుప్లేట్ మీద ఫ్లకున్వేట్ అవుతోంది. ఎయిర్‌బ్రేక్ మెకానిక్‌కి ఇన్‌ఫార్మ్ చేశాను. ఎడం పక్క రెండో నెంబరు సిలిండరు హెడ్డు ల్యూబ్రికేషన్ పైపులో హెవీలీక్. దాన్ని బిగించేను. సరే అది కట్టేసింది. ల్యూబాయిల్ స్ట్రెయినర్ విక్టాలిక్ గాస్కెట్ ఒకటి హెవీగా లీక్ అవుతోంది. గాస్కెట్ మార్చి రెండు బేరల్సు ల్యూబాయిల్ ఇంజినుకి నింపాలి." గుక్క తిప్పుకోని రాజు కంఠం.

ఇంకా చెప్పునో ఏమో ఫోను రింగయిందని ఆపేసాడు రాజు!

రిసీవరు ఎత్తేడు రామారావు.

అవతల్నించి "నేనూ శ్రీహరిని.... ఎకౌంట్స్ క్లర్కు శ్రీహరిని. ఎక్స్చేంజి నించి మాట్లాడుతున్నాను."

"....ఆ .... చెప్పండి శ్రీహరిగారూ. ఇంత రాత్రప్పుడు...." "మీ మిసెస్ ఒంట్లో బాగులేదు కదా. ఇప్పుడింకా తీవ్రంగా వుంది. మీరు అర్జెంటుగా రావాలి. రైల్వే ఆసుపత్రికి తీసికెళుతున్నాం...."

"అలాగే వస్తున్నాను" ఫోను పెట్టేసాడు రామారావు.

"రాజూ జూనియర్ చార్జిమేన్ ప్రసాదరావుగార్ని పిలూ."

రెండు నిమిషాల తర్వాత ప్రసాదరావు, రాజూ కలిసి షిఫ్టు రూమ్‌లోకి వచ్చేరు.

"ప్రసాదరావుగారూ అర్జంటుగా నేను ఇంటి కెళ్ళాలి. మా ఆవిడ ఒంట్లో బాగులేదు. ఆసుపత్రిలో జాయిన్ చేసారుట!"

"సారీ సార్. కోరమండల్, జనతా ఎక్స్‌ప్రెస్సు ఇంజన్లు షెడ్‌పదిలే టైమిది. మీరు వెళ్ళిపోయారంటే ఆ ఫోన్లు నేను ఎటెండవలేను. నాకీ షిఫ్టు డ్యూటీ కొత్త కదా. మొన్న మొన్నటి వరకూ ఓవర్ హాలింగ్ బెంచ్‌లో పనిచేసాను."

"మీరు చెయ్యాల్సిందేమీలేదు: శంకర్రావుతో నే చెప్తాను. రాజు కోరమాండల్ ఇంజిను రెడీ చేస్తున్నాడు కదా."

"సారీ, నా పనితోనే నేను పడలేకపోతున్నాను. తెల్లారేసరికి ఆఫీసర్లందరి ఇళ్ళకి పొజిషన్ పాటలా పాడాలి. నాకు తెలీదు."

"పోన్లెండి. వెళ్ళి మీ పని మీరు చూసుకోండి."

రామారావుకి గతంలో జరిగిన సంఘటనలు ఒక్కొక్కటే కళ్ళముందు తిరుగుతున్నాయి.

"ఈ రోజు డ్యూటీకి వెళ్ళకురా. సత్యవతికి మూడు రోజులై ఒంట్లో బాగులేదు కదా. బాగా నీరసించిపోయింది. రాత్రికి ఎలా వుంటుందో డాక్టర్లిచ్చిన మందువల్ల ఏమీ తగ్గినట్టు లేదు."

"ఎలా అమ్మా. ఈ రాత్రి నేను డ్యూటీకి వెళ్ళకపోతే ఫోర్మెన్ ఇంటికి కాల్ వెళుతుంది. అర్ధరాత్రప్పుడు అతను మాత్రం ముందు చెప్పకపోతే ఎవర్నని రాత్రికి రాత్రి ఎరేంజి చెయ్యగలడు? ఈరాత్రి డ్యూటీ అయిపోతే రేపూ, ఎల్లుండీ రెస్టే కదా. రేపు మరో డాక్టరు దగ్గరికి తీసికెళతాలే. డాకరు సరిగ్గా డయిగ్నయిజ్ చెయ్యలేదేమో".

"నేను చెబుతునే వున్నానురా నీకు! ఇది పచ్చకామెర్లుకిందే తిరగేసింది. నీకూ, ఆ డాక్టరుకీ తెలీదు."

"రేపు డాక్టరుని మారుస్తాలే అమ్మా. రాత్రికి దానికి గ్లూకోజు నీళ్ళు మందూ ఇస్తూ వుండు."

అసహనం సహించక చేతులు కడిగేసుకున్నాడు తను. కొడుకువంక ఆప్యాయంగా నిస్సహాయంగా చూసింది వెంకటలక్ష్మి. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేయి. కోడలు మంచం పట్టిందంటే ఆమెకేం తోచదు. 'రేపు డ్యూటీనించి రాగానే తోటకూర కాడలా మంచం ఎక్కేస్తాడు రాత్రంతా డ్యూటీ చేసినందువల్ల' అదీ ఆమె ఆలోచన.

"మరేం బెంగలేదు. రేపుదయం మంచి డాక్టరు దగ్గరకు తీసికెళతాను. ఈ రాత్రికి నిశ్చింతగా వుండు" భార్యను ఓదార్చేడు.

"ఏమోనండీ. నాకు భయం వేస్తోంది." సత్యవతి మాటలు నూతిలోంచి వస్తున్నట్టు.

"భయంలేదు. రేపు డ్యూటీనుంచివచ్చిన వెంటనే వెడదాంగా. ప్రకాశరావుగారని ఎంబిబియస్ డాక్టరున్నారు. ఆయనకు క్లినికల్ లేబొరేటరీ కూడా వుంది. అక్కడికెడదాం."


"మనకి పాపో, బాబో వుంటే నాకీ బెంగ వుండేది కాదండీ. నేను ఏమైపోయినా మన గుర్తుగా మిగిలి వుండేది. పిల్లలు పుట్టకపోవడం దురదృష్టం."

"అదేంటి సత్యా, అంతబేలగా మాట్లాడుతావు. మన దురదృష్టం కొద్దీ క్రితంసారి మిస్ కేరేజ్ జరిగిందిగానీ లేకపోతే ఈ పాటికి బాబో, పాపో మనింట్లో ఆడుకొని వుండేది కదా. పిచ్చిపిచ్చిగా ఆలోచించక రెస్టు తీసుకో."

మళ్ళీ ఫోను. శంకర్రావు. "ఇంజను ఎలా వుందండీ గురూగారూ"

"కాంట్ బట్ కదా. ఎలాగోలా ఇస్తాను


## పరిచయం



నా కథకు బహుమతి వచ్చినందుకు సంపాదక వర్గానికి, న్యాయనిర్ణేతలకు కృతజ్ఞతలు. శ్రమశక్తికి మించిన శక్తి ఏదీలేదు కాబట్టి శ్రామికులకు యాజమాన్యానికి మధ్య దూరం తగ్గాలి. శ్రామికుడు నష్టపోతే అది ఓ కన్నీటి కథకు 'ముగింపు' కావొచ్చు, కానీ కొత్త చరిత్రకు ప్రారంభం అని యాజమాన్యం శ్రామికులూ కూడా గుర్తించాలి. అలా ఎన్నో కథలు అల్లాలని ఉబలాటపడుతున్న నేను ప్రయత్నించిన రెండో కథ ఇది. మొదటిది 'జ్యోతి' మంత్లీలో "దేవుని ముగింపు" అని అచ్చయింది. ఇక నా కథలో కొన్ని పొరపాట్లు దొర్లినా కథ పేరు బాగులేకపోయినా మార్చే హక్కు నన్ను ముందునుంచీ ప్రోత్సహిస్తున్న మీకు వుంది.

పూర్తి పేరు : గుడిమెట్ల గోపాలకృష్ణారావు స్వస్థలం : గరివిడి, తల్లిదండ్రులు : శ్రీమతి వెంకటరత్నం, శ్రీ వెంకటరమణయ్య. శ్రీమతి: విజయశ్రీ ప్రియంవద. ఉద్యోగం : జమాల్‌పూర్ కలకత్తా. ప్రస్తుతం వాల్తేరులో డీజెల్ లోకో షెడ్డులో చార్జిమేన్. విద్యాభ్యాసం : స్కూల్ ఫైనల్ తర్వాత ఎల్. ఎమ్. ఇ. (దూసి, శ్రీకాకుళం, వైజాగ్), అభిమాన రచయితలు : శ్రీ ఘండికోట బ్రహ్మాజీరావు, శ్రీ గణపతిరాజు అచ్యుతరామరాజు. ప్రోత్సాహమిచ్చినవారు : జ్యోతి మంత్లీ, ఆంధ్రజ్యోతి, విశాఖ సాహితి.

—గుడిమెట్ల గోపాలకృష్ణ



లేండి" 'ఎవరి బాధ వారిది' అనుకుంటూ రిసీవరు పెట్టేసాడు రామారావు.

"క్విక్ రాజూ. ఒక్కొక్కటే ప్రారంభించు."

"చేస్తాను సార్. కానీ ఎనిమిదిలోగా అవుతుందని గారెంటీ లేదు."

"ట్రయిచెయ్యి. వెళ్ళు. డోన్ట్ వేస్ట్ టైమ్."

రాజు అలా వెళ్ళేడో లేదో గేరుకేసు బోల్టులు బిగించే నారాయణ బిక్కమొహం వేసుకు వచ్చేడు.

"ఏంటివాయ్" చనువుగా అన్నాడు రామారావు.

"ఇంజను లక్కీగా వచ్చేసింది సార్. నంబర్ వన్ గేరుకేసు బోటమ్ బోల్టులు డ్రాపయిపోయేయి. హేంగింగ్ బోల్టులు న్నాయి. సైడు బోల్టుకోసం ట్రాక్షన్ మోటారులో థ్రెడ్స్ లేవు. మీరు ఎలా చేస్తే బోటమ్ బోల్టులు బిగించి తోసెస్తాను. నంబరు టూ హేంగింగ్ బోల్టు గేస్‌తో కట్‌చేసి తియ్యాలి"

"నారాయణా హరికథలు చెప్పక. వేగం వెళ్ళి గేస్‌కట్టర్‌ని తీసికెళ్ళి ఆ పనిచూడు. హరిప్రసాద్‌ను హెల్ప్ చెయ్యమను."

ఒకరి జాగాలో ఇద్దరి చొప్పున ఐదుగురి జాగాలో పదిమందిని పట్టుదలగా వేసేసి పని ధ్యాసలో పడ్డాడు రామారావు. ఆ క్షణం అవసరం అలాంటిది మరి! సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్సు ఒక్కక్షణం షెడ్ ఎకౌంటులో డిలేఅయినా, ఫెయిలయినా మర్నాటి కల్లా "నీకు ఇంక్రిమెంటు ఎందుకు బందు చెయ్యకూడదూ" అనిమెమోఅందిపోతుంది. సంవత్సరం ఎదురుచూసే అపురూపమైన పదిహేను రూపాయిల ఇంక్రిమెంటు ఒక్క క్షణంలో స్వాహా!

మళ్ళీ రాజు ప్రత్యక్షం. "సార్ విక్టోరి లీక్ గాస్కెట్ మార్చేను. లీక్ కట్టలేదు. మీరొకసారి రండిసార్."

రామారావు గొంతు ఒక్కసారిగా తడి ఆరిపోయింది. ఎప్పుడూ ఇంత టెన్షన్ రాలేదు డ్యూటీలో. సీసాలో చల్లనినీళ్ళు గొంతులో పోసుకున్నాడు.

సెక్షన్‌లో తిరిగే అతి ముఖ్యమైన కోర మండల్ ఎక్స్‌ప్రెస్సు. దాన్లో జనరల్ మేనేజర్ ప్రయాణం చెయ్యొచ్చు. సాక్షాత్తు రైల్వే మినిస్టరే ప్రయాణం చెయ్యొచ్చు. అసలు ఎవరూ అక్కర్లేదు ట్రయినంతా ఖాళీగా వున్నా సరే లేట్ స్టార్టయినందుకు తనకు చీవాట్లూ ప్లస్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్సు ఖరాబవడం తప్పదు. "పద" చేతిలో టార్చిలైటుతో ఇంజనుమీదకు నడిచేడు రామారావు. నిజమే. లీక్ కట్టలేదు. గాస్కెట్ వేసి, పేకింగ్ ఇచ్చి, నట్లు బిగింపించేసరికి గంట పట్టింది. అప్పుడొచ్చి పడ్డాదో కొత్త సమస్య.

మెయిన్ రిజర్వాయరు డ్రయి నవ్వడం లేదు. లోపల "కండెన్సేట్" ఎక్కువయిపోయి రిజర్వాయరు గాలంతా నీరయి పోవచ్చు.

మామూలుగా వైరుముక్క తోస్తే ఫస్ మని గాలి వూదే "ఎమ్మార్" కూడా ఈ రోజు అల్లరి పెడుతోంది.

ఇంకో రెండు గంటల్లో ఇంజను షెడ్ వదలాలి.

"రాజూ గట్టిగా ప్రయత్నించు" అని అలసటతో షిప్టు రూమ్‌కి దారితీసాడు రామారావు. ఎమ్మార్ డ్రయినవకపోయినా సరే ఇంజన్ని వదలడానికే నిశ్చయించుకున్నాడు ఆక్షణంలో అతను. ప్రతీదీ రూల్సు ప్రకారం వెళితే అసలే బండి తిరగకనేపోవచ్చు. అలా అని రిస్కు తీసుకోనూ కూడదు. ఈ రెండిటికీ మధ్య ఆరో ఇంద్రియం చెప్పిన కాంప్రమైజుతో పనులు జరుగుతాయి.

కేంటీన్‌లో టీ త్రాగి షిప్టు రూమ్‌లో అడుగుపెట్టేడో లేదో బిక్కమొగం వేసుకొని అక్కడున్నాడు రాజు. "దూసుకోలేదు సార్.

సెపెరేటర్ వాటర్ జంపర్ కూడా హెవీ లీక్ అవుతోంది."

ఒళ్ళు మండింది రామారావుకి. అయినా అతనికి ఇప్పుడు కోపం కూడా పిలిస్తే రావడం లేదు. "కొంప ముంచేవయ్యా. బండి లేట్ స్టార్ అవకుండా నువ్వే చూడు" అన్నాడే కాని రామారావు మనసు మనసులా లేదు. మరింత మెత్తగా "నాలుగు న్నరయి పోయింది. టైము ముందూ వెనకా చూడకు. ఇంజిన్ని వాటర్ కాలమ్‌లో పెట్టి స్తానుగాని గాస్కెట్ మార్చి అవతల పారెయ్. నువ్వెళ్ళి మార్షలింగ్ బోయ్ సుబ్బారావుని పంపు."

మరో గంటలో ఇంజను సిద్ధమైంది.

షెడ్‌నించి టార్‌లైను పక్క ఆ ఇంజిను ఠీవిగా వెళుతుంటే, షంటరు పంచింగ్ విజిల్ మ్యూజికల్‌గా కొడుతుంటే రామారావు ప్రాణానికి హాయనిపించింది. శ్వాస కోశాలనిండా తృప్తిగా గాలి పీల్చిన క్షణం అది.

అది శ్రమకు తగ్గ ఫలితం.

అందులో ఎంత చీదర వున్నా చివరకు కలిగేది గర్వమే.

చేసినది చేయించినది డ్యూటీయే అయినా వెయ్యి త్యాగాల దర్పం మనసును ఆవహించే నిముషమది.

ఉద్వేగానికీ, ఉత్కంఠకీ, శ్రమకీ ముడి పడిన కర్తవ్యదీక్ష సాధించిన ఆ అనుభూతి విలువ రూపాయలతో, పైసలతో కొలవ లేరు ఎవరూనూ. ఎవరో మొండి ఆడిట్ వాళ్ళు తప్పా.

మళ్ళీ ఫోను రింగయింది.

"హలో రామారావుగారండీ. నేనూ శ్రీహరిని మాట్లాడుతున్నాను రైల్వే హాస్పిటల్ నుంచి."

"చెప్పండి" అన్నాడు రామారావు హుషారుగా ఇంజిన్ బయలుదేరిపోయిన విజయగర్వం తలకెక్కి.

"ఐ హేవ్ బ్యాడ్ న్యూస్ ఫర్ యూ, సారీ. మీ ఆవిడ పోయేరు. పది నిమిషాలైంది. మీ అమ్మగార్ని పట్టుకోలేక పోతున్నాం. మీ రెలాగో బయల్దేరిరావాలి"

ఒక్కసారిగా తల తిరిగినట్టయింది రామారావుకి. ఫోన్ అలా వదిలేసేడు. కుర్చీలో కూలబడ్డాడు. శ్రీహరి చెప్పినది నమ్మబుద్ధి కాలేదు. కానీ అది వాస్తవం.

జీవితానికి అర్థభాగం సత్యవతి. ఆమె

మరికలేదు. రామారావు మౌనంగా అర నిముషం ఆక్రోశించేడు.

ఎనిమిదవడానికి ఇంకా రెండున్నరగంట లుంది.

* * *

సరిగ్గా పదమూడో రోజున మళ్ళీ అదే అర్ధరాత్రి షిఫ్టు డ్యూటీ ఎక్కేడు రామారావు. ఇంజన్లూ గొడవా ప్రతిరోజూ మామూలే. ఫిట్టర్లను కసురుతూ వుండాలి. గుండెల పొరల్లోంచి ఆత్మీయత వాళ్ళకు పంచనూ పంచాలి. వాళ్ళరక్తాన్ని వాడుకొని మనసుల్లో అమృతం పొయ్యాలి.

అల్మారాలో ఆఫీసు ఫోల్డరులో మీదనే వుంది. "అయిదుగురుచేత చేయించాల్సిన పనికి డెలిబరేట్‌గా పదిమందిని బుక్‌చేసి ప్రభుత్వ నిధుఃను వృధా చేసినందుకు" చార్జిషీటు. రామారావు దాన్ని చూసి సంతకం చేసేడు.

ఆ ఎనిమిది గంటలూ నిర్లిప్తంగా గడిచేయి. ఆరోజు కోరమండల్ ఎక్స్‌ప్రెస్సు సకాలంలో వెళ్ళింది. కానీ తన జీవిత భాగస్వామిని అకాలంలోనే వెళిపోయింది. రయిట్టయిమ్-రాంగ్ టైములు జమిలినేతలోంచి తనకు పుట్టిన బహూకృతి. ఈ చార్జిషీటు.

ఎంత వద్దనుకున్నా ఈ విషయంలో డి.ఎం.ఇ.ని కలవాలని అన్పిస్తోంది.

ఎనిమిది గంటలయింది టైము.


జనరల్ షిఫ్టు ఆఫీసర్లు.సూపర్‌వైజర్లూ. వర్కర్లూ పొలోమని ఎనిమిది గంటల పొజిషన్ని బోర్డు మీదినించి డైరీలో కెక్కించుకుంటున్నారు.

ఎ.సి రూమ్‌లో ఆఫీసర్లందరూ కూర్చొని ఆ షిఫ్టులో జరగవల్సిన పనిని సమీక్షించుకుంటున్నారు.

రూమ్ తలుపులు తెరుచుకొని ఒక చేత్తో గుడ్‌మార్నింగులు చెప్పుకుంటూ రామారావు "పదకొండు గంటలకి వెళ్ళవల్సిన బొకారో ఎక్స్‌ప్రెస్‌కి ఇంజను రెడీకాలేదు సార్. 18339 చక్రాలు 100 కె. యం. స్పీడుకి తట్టుకునేట్టుగా లేవు. 18220 వుంది కానీ ట్రాక్షన్ మోటర్ బ్లోయరు మార్చాలి. బేరింగ్సు పోయాయి. ల్యూబాయిలు రాత్రి 1504 లీటర్లు వాడేం. డ్యూటీలో ఎవరికీ ఇంజ్యూరీస్ లేవు. అటెండెన్సు సెవెంటీ పర్సెంటు. అనంతం రాత్రి బాగా తాగి వచ్చేడు,డ్యూటీకి తీసుకోలేదు."

"ఐసీ"సిగరెట్ దమ్ము గట్టిగా లాగుతూ ఎ.యం.ఇ. రమణారావు.

"మా ఓవర్‌టైము బిల్లులు పాస్‌చెయ్యరంట సార్" అన్నాడు పక్కనే నిలబడ్డ రాజు. సంతకానికి తెచ్చిన రిపేరు బుక్సు టేబిల్‌మీద పెడుతూ.



సాధారణంగా అలా సంతకాలు కావల్సిన రిపేరుబుక్సు టేబిల్‌మీద పెట్టేయరు. ఒద్దికగా ఆ పేజీలు తెరిచి పట్టుకొని అధికారి కలం మొన తన ఫోటు ఎక్కడా అని వెతుకుతున్న సమయంలో ఒక వేలు చూపించడం రివాజు. అదేం పాటించకుండా అలా నిర్లక్ష్యంగా పుస్తకాన్ని బల్లమీద పెట్టేయడం చూసి రమణారావు మండిపడ్డాడు. "ఎవరిదన్నా చూసుకోనోయ్. మీ పొగరు?"

చార్జి అప్పజెప్పినట్లు ఆఫీసరు షిఫ్టు డైరీలో సంతకం చేసేస్తే రామారావు డ్యూటీ దిగిపోవచ్చు. ఈ నియమం జనరల్ డ్యూటీకి మాత్రమే వర్తించేటట్టు పద్ధతి పెట్టేడు రమణరావు. పరిస్థితుల్ని అర్థం చేసుకోవడం,విశ్లేషించుకోవడం సులువవుతుందని, ముఖాముఖిని కొన్ని సంగతులు ఈ మూలంగా తెలుసుకోవచ్చునని ప్రాసుకొని పద్ధతిని అధికార్ల ఆమోదానికి తెచ్చాడు.

సంతకం చేయడానికి అక్కడ కలం పెట్టే సంతలో ఫోను మ్రోగింది.అంతే. సంతకం వాయిదా పడింది.

"హలో ఎ. యం. ఇ. రమణరావు స్పీకింగ్"

"...............…"

"ఐ సీ. నేనొక గంటలో వస్తాను. సరిపోతుందా?"

"...............…"

"అలాగా. సరే వస్తున్నాను" ఫోను పెట్టేసి రమణరావు లేచేడు. లేవటానికి వెళ్ళే ధోరణిలో సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె చేత పుచ్చుకున్నాడు. సైడు డోర్‌లోంచి వెళ్ళేడు.

రామారావు, రాజు మొహాలు చూసుకొని రూము విడిచి వచ్చేరు. "చూశారా సార్, ఆళ్ళు చేసే పన్లు అలా వుంటాయి. రెండు సంతకాలకి బద్ధకించి ఎక్కడికో ఎళిపోతన్నాడు. నాకు తెలుసులెండి ఎక్కడికెళతన్నాడో. రాత్రి తెల్లవార్లూ జాగారం సార్. ఐ.ఓ. డబ్ల్యూ లక్షణాచారి గారింట్లో పార్టీ. భజనా. పేకాటా సార్-అక్కడికే." అన్నాడు రాజు.

* * *

మర్నాడుదయం చార్జి అందజేస్తున్నప్పుడు రామారావు మనవి చేసుకున్నాడు "సార్. మొన్న నాకు అన్యాయంగా చార్జిషీటిచ్చారు. ఆ రాత్రి అంతమందిని బుక్ చెయ్యకపోతే పనులు అయి వుండేవే కాదు."

"నువ్వేం చెప్పదలచుకున్నావో అన్నీ రాత మూలకంగానే ఇవ్వు."

"అది సరేసార్. వాళ్ళ ఓ.టి. బిల్లులు సంతకా లవ్వలేదుట?"

"ఆ చార్జిషీటు జవాబు పరీక్షించి చూశాకనే ఆ బిల్లులు సంతకాలవుతాయి. ఆ మాత్రం తెలీదా?"


"మీరు ఒప్పుకుంటే సంతకాలు నిముషాల మీద అయిపోతాయి సార్. ఎందుకంటే ఆ రోజు నేను బుక్ చేసినది కేవలం ఎటాక్ రిపేర్సు కోసం తప్ప మరోటి కాదు. కోరమండల్ కివ్వవల్సిన ఇంజిను సర్దేసేక 18221. 17335 కూడా చూసి వాళ్ళంతా ఆ మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఇళ్ళకు వెళ్ళేరు"

"చెప్పేను కదా రాసిమ్మని."

* * *

ఆ మర్నాడు—

జనరల్‌షిఫ్ట్‌కి వచ్చిన వర్కర్లు ఎవ్వరూ టోకెన్లే తీసుకోలేదు ఎక్కడి ఇంజన్లు అక్కడే ఆగిపోయేయి. షెడ్ స్టాఫ్‌లో "లైటెనింగ్ స్ట్రయిక్"అనే మాటలు గుస




గుసలుగా. బుసలు బుసలుగా. అసలు సిస లుగా వ్యాపించి అందరూ గేటు బయటకు చేరేరు. "ఓవర్ టైములు శాంక్షను కావాలి" అన్న నినాదం. అదే పిలుపు ఆ సమ్మెకు.

నుంచున్న పొళంగా షెడ్ అంధవికా రమై పోయింది. పెద్దపెద్ద శబ్దాలు చేసే ఇంజన్లు అంతసేపూ కాలి అప్పుడే ఆరిన పూరిగుడిసెల్లా వున్నాయి.

గేటు బయట పున్నాగ చెట్టుకి ఆనుకొని నుంచున్నాడు రామారావు. క్లీనర్లూ, ఫిట్టర్లూ, హెల్పర్లూ ఒకరేమిటి అందరూ అక్షరాలా నేలమీద మఠాలేసు కూర్చొని రామారావు నోటంటవచ్చే "వేదవాక్కు" కోసం ఎదురుచూస్తున్నారు. సూపర్‌వైజర్లు సమ్మెలతోనూ. యూనియన్లతోనూ పెట్టు కోరు. కానీ రామారావుకి ఆ పరిస్థితుల్లో వున్న వర్కర్లని అలా వదిలేసేటంత నిర్లిప్తత లేదు.

* * *

ఆ బైఠాయింపు డి.ఎం.ఇ. జీపు చప్పు డికి గానీ. సామీప్యానికి గాని చెదరలేదు. బెదరలేదు.

"వాటీజ్ గోయింగాన్ హియర్ !"

"సాహెబ్. ఎఖానే హర్తాళ్ చొల్చె" (ఇక్కడ సమ్మె జరుగుతున్నది) అన్నాడు దిలీప్ ముఖర్జీ అనే గ్రేడువన్ ఫిట్టరు.

"బట్. వై?"

"ఓవర్ టైము దిలోనా రమణరావ్. ఎ.ఎం.ఇ.సాబ్.ఒయ్ దిన్ పాంచ్ ఫిట్టరేర్ బదులే ధొస్టా ఫిట్టర్ రామారావ్ సాబ్ బుక్ కొరిఛిలో బొలే" (ఎ.యం ఇ. రమణ రావు గారు ఓవర్ టైమ్ ఇవ్వలేదు. ఆ రోజు రామారావుగారు అయిదుగురు ఫిట్టర్లకి బదులు పది మందిని బుక్ చేసి నందుకు గాను)

"ఓవర్‌టైము ఎప్పటిది?" బెంగాలీలో అడిగేడు డి. యం. ఇ.

"పన్నెండు రోజుల క్రిందటిది"

"ఇన్నాళ్ళు ఎందుకు వూరుకున్నారు?"

"రామారావు భార్యపోయి శెలవుమీద వెళ్ళేరు. "వారు వచ్చేక చెప్తే సరిపోతుం దనుకున్నాము. కానీ వారు తిరిగి డ్యూటీలో చేరేక ఓవర్ టైము ఇవ్వకపోవడమే కాకుండా వారికో చార్జిషీటు."

డి యం.ఇ. బెనర్జీ రామారావుని ఆప్యా యంగా కౌగలించుకొని "ఐ యామ్ సో సారీ డియర్ రామారావు" అన్నాడు. "నేను విన్నాను,ఆవిడ తెల్లవారి అయిదు న్నరకి చనిపోయినా కూడా నువ్వు ఎని మిది గంటల వరకూ డ్యూటీ దిగనేలేదటగా. నీ వంటి ఉద్యోగులున్నందుకు నాకు గర్వంగా వుంది. కానీ ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు సరాసరి నాతోనే చెప్పాలి. నేనెంత బిజీగా వున్నా సరే. ఓ. కె. నాకు సమ్మెలంటే చిరాకు. కిలోమీటర్ ఎరిన్షం గ్స్‌లో మన షెడ్ ఈ దేశానికే ఫస్టు. ఇప్పుడదంతా ఏం కావాలి. నోనో."

"అవున్సార్. అందుకేగా మా నోట్లో మట్టికొడుతోంది యాజమాన్యం" అన్నాడు పీటర్.

"ఎవరు చెప్పేరు. కిందటేడు మీకంద రికీ మూకుమ్మడిగా వచ్చిన మూడువేల రూపాయిల అవార్డు మర్చిపోయేరా."

"కుక్కకి బిస్కట్లు పారేసినట్టు అప్పు డప్పుడు మీరిలా చేస్తుంటారు లెండి. అయినా కక్ష వున్నవాళ్ళ పాస్‌లూ, ఇంక్రి మెంట్లూ బంద్ చేస్తూ వుంటారు కూడా" —పీటరు—

"ఇతను తప్పుగా అర్థంచేసుకున్నాడను కుంటాను రామారావు. ఇంతకీ ఎంతసేప యింది మీ రివతలికొచ్చి."

"రెండు గంటలాస్సార్"

"మీ ఎ.యం.ఇ. ఎక్కడ?"

"ఎక్కడో పేకాటలో వుంటారు సార్" పీటరే—

"నన్ను మాటాడనీ పీటర్" అని కసిరి రామారావు "వారు వుదయం డ్యూటీకొచ్చి అర్జంటు ఫోను కాల్ మీద ఎటో వెళ్ళారు సార్."

"ఓ.కె. ఇప్పుడు వెళ్ళాల్సిన ఇంజన్లు ఏ: వేం వున్నాయి?"

"18371, 18375, 19299 గూడ్సు బళ్ళకు, 18223 బొకారో ఎక్స్‌ప్రెసుకి వెళ్ళాలి."

"సపోజ్ నేను మీకు రావాల్సిన ఓటీలు ఇచ్చేసాననుకోండి, అంతేకాక అది రామా రావు సేలరీకి డెబిట్ కాకుండా చూసేనే అనుకోండి, ఆ నాలుగు ఇంజన్లూ షెడ్ నుంచి రయిట్టయిమ్‌కి వెళిపోతాయా?" బెనర్జీ సూటిగా రామారావు ముఖంలోకి చూసేడు.

రామారావు వందల సంఖ్యలో వున్న తన సేనవైపు చూసేడు. ఆ చూపు తిన్నగా రాజుకి గుచ్చుకుంది.

రాజు సింహాద్రి వైపు చూసేడు.

సింహాద్రి దిగ్గున లేచాడు. ఫేంటు కంటుకున్న దుమ్ము దులుపుకుంటూ. లేచిన వాడు ఎవరితోనూ మాట్లాడకుండా సరాసరి ఇంజిన్ మీదికి వెళ్ళిపోయాడు.

బెనర్జీ రామారావుకి షేక్‌హేండిస్తూ "అందుకే నాకు సింహాద్రి లన్నా అలాంటి వేలాది వర్కర్సన్నా ఇష్టం. ఫిట్టర్నించి డి.యం ఇ వరకూ ఈ రైల్వేలో ఎవరికైనా అత్యంత ప్రియమైనది ఒకే ఒక్కటి.... అదే. పని: అదే. డ్యూటీ!.... అదే నిజా యితీ!" అన్నాడు.

"మీరు మెచ్చిన ఆ గుణాలకు అవ మానం. అగౌరవం కలగవు కదా. సార్?"

పావుగంటలో డీజల్ లోకోషెడ్ నించి అహ్లాదకరమైన రణగొణ ధ్వనులు విన్పిం చేయి.

